సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం ၊ 20 ၊ జనవరి ၊ 2023



'గుర్తింపు'పై ఉత్కంఠ

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు చెబుతున్నా.. కాలయాపన చేస్తున్నారని పలు సంఘాల నాయకులు అంటున్నారు. 8లో▸



రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్నకు 21 రోజుల్లో హుండీల ద్వారా రూ.1.35 కోట్ల ఆదాయం, 102 గ్రాముల బంగారం, 11.200 కిలోల వెండి సమకూరింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /17.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

6666కు.. రూ.4.20లక్షలు


వాహనంతో కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: వాహనానికి ఫ్యాన్సీ నంబరు కావాలని వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు కోరుకుంటారు. పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ ఇటీవలే తాను కొనుగోలు చేసిన వాహనానికి 'టీఎస్22హెచ్ 6666' నంబరును దక్కించుకునేందుకు ఆర్‌టీఏ ఆన్‌లైన్‌లో పోటీపడ్డాడు. రూ.30 వేలతో మొదలైన బిడ్డింగ్‌లో తీవ్రపోటీ ఏర్పడింది. అందరి కన్నా ఎక్కువ రూ.4.20 లక్షలు వెచ్చించి 6666 నంబరును సొంతం చేసుకున్నట్లు కొలిపాక శ్రీనివాస్ తెలిపాడు. ఆన్‌లైన్‌లోనే డబ్బు చెల్లింపు, నంబర్ల కేటాయింపులు జరుగుతాయని జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావు వివరించారు.

ప్రత్యక్ష పోరాటాల ద్వారానే ఇళ్ల పట్టాలు


వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

గోదావరిఖని: ప్రత్యక్ష్య పోరాటాల ద్వారానే ఇళ్ల పట్టాలిప్పించడం సాధ్యమవుతుందని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం మందకొమురమ్మ కాలనీవాసులు రాజ్‌ఠాకూర్‌ను కలిసివినతిపత్రం ఇచ్చారు. కాలనీవాసుల ఇళ్లస్థలాలకు పట్టాలు పొందేందుకు పూర్తిగా సహకరిస్తామని అన్నారు. నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న నిరుపేద, దళిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని అన్నారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, గాదం విజయ, పెద్దెల్లి ప్రకాశ్, యుగంధర్, కాలనీవాసులు ఉన్నారు.

పాఠశాలల సందర్శన


పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రాజీవ్

మంథని: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రేజింగ్ ఇండియా పథకం కింద దరఖాస్తులు చేసుకున్న మంథనిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, ఎక్లాస్‌పూర్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్ సందర్శించారు. పాఠశాలల్లోని వసతులు, సౌకర్యాలను తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కో–ఆర్డినేటర్ జక్కం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సంపత్‌రావు, వెంకట్రామిరెడ్డి, సీఆర్పీ మల్లన్న ఉన్నారు.

అద్దెబస్సు డ్రైవర్ల ఆందోళన


నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

మంథని: మంథని ఆర్టీసీ డిపో పరిధిలోని అద్దె బస్సు డ్రైవర్లు గురువారం సమ్మెకు దిగారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అద్దెబస్సు ఓనర్లకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విధులు బహిష్కరించారు. అద్దె బస్సు డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్ మాట్లాడుతూ.. వేతనాల పెంపు కోసం మూడుసార్లు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పదిహేను రోజుల క్రితమే సమ్మెనోటీసు ఇచ్చామని తెలిపారు. జీవో నంబరు 25ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 8.33 శాతం బోనస్‌గా నెలవేతనంతో పాటు రెండు జతల యూనిఫాం అందించాలని అన్నారు. వీరికి ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేశ్, ఆర్ల సందీప్ మద్దతు తెలిపారు.

24న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ఈ నెల 24న ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. హైదరాబాద్‌లోని టీంలీజ్ ప్రైవేట్ కంపెనీలో సేల్స్ అసోసియేట్, డెలివరీ కన్సల్టెంట్, టీంమెంబర్‌గా పనిచేయాల్సి ఉంటుందన్నారు. 18నుంచి 35ఏళ్ల లోపు వయస్సు ఉండి 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన వారికి అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబరు 8985336947, 9502642441ను సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు.

ప్రకటనలకే పరిమితం!


రామగుండం బల్దియాలో రోడ్లపై ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు...

- పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం
- పట్టణాల్లో విచ్చలవిడిగా హోర్డింగులు, ఫ్లెక్సీలు
- సర్కారు ఆదాయానికి గండి
- రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపునకు వెనకడుగు
- ప్రకటనల పన్ను కోల్పోతున్న జిల్లాలోని మున్సిపాలిటీలు

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని మున్సిపాలిటీల్లో అనుమతుల్లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రకటనల బోర్డుల ఆదాయం పెరిగే అంశాలపై దృష్టిపెట్టాల్సిన అధికారులు, కనీసం ప్రస్తుతం ఉన్న పన్నుల డిమాండ్‌ను కూడా సరిగ్గా వసూలు చేయలేకపోతున్నారు. ఓ వైపు ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. అయినా మున్సిపల్ అధికారులు ప్రకటనల బోర్డుల ఆదాయాన్ని రాబట్టలేకపోతున్నారు. ముఖ్యంగా రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో అనధికారి అడ్వటైజ్‌మెంట్ హోర్డింగ్‌లు, ఫెక్సీలు ఎక్కువగా ఉన్నాయి. కాగా రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగించడానికి అధికారులు జంకుతున్నారు.హోర్డింగ్ యజమానులకే నోటీసులిచ్చి సరిపెడుతున్నారు.

రామగుండంలో రూ.19 లక్షల డిమాండ్

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో సుమారు రూ.19లక్షల వరకు ప్రకటనల బోర్డుల పన్ను డిమాండ్ ఉంది. 17 సంస్థలకు చెందిన 155 ప్రకటనల బోర్డులు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రూ.8లక్షల వరకు ట్యాక్స్ వసూళ్లు జరిగినట్లు వెల్లడిస్తున్నారు. ఆదాయం పెంపు, ట్యాక్స్ వసూలు పెరగకపోవడం టౌన్‌ప్లానింగ్ విభాగం పనితీరుకు అద్దం పడుతోంది. పన్ను చెల్లించాలని హోర్డింగ్ యజమానులకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫోన్లుచేసినా స్పందన రాకపోవడం గమనార్హం.

మున్సిపాలిటీల్లో మరీ దారుణం

పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో ప్రకటనల పన్ను వసూళ్లపై స్పందన కనిపించడం లేదు. అడ్వటైజ్‌మెంట్ ట్యాక్ పెంపునకు అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించకపోవడంతో ఆదాయం పెరగడం లేదు. అధికారుల దగ్గర కూడా సరైన వివరాల్లేవు. సిబ్బంది కొరత సాకుచూపిస్తూ చేతులెత్తేస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త చట్టం అమలేదీ..?

నగరపాలక సంస్థలో అనుమతి లేకుండా విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించడానికి అధికారులు పురపాలకశాఖ కొత్త చట్టం 2019ను అమలు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. పురపాలక, నగరపాలక సంస్థల పరిధిలో ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగుల ఏర్పాటుకు ప్రత్యేక నిబంధనలను మున్సిపల్ కొత్త చట్టంలో పొందుపర్చారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ముందస్తుగా ఫీజు చెల్లించి ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో అనుమతి తీసుకున్న సైజు వేరు, ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు వేరనే ఆరోపణలు కొన్నాళ్లుగా జోరుగా వినిపిస్తున్నాయి.

పొలిటికల్ భయం..

జిల్లాలోని పట్టణాల్లో రాజకీయ నాయకుల కనుసైగల్లోనే ఫ్లెక్సీలు, హోర్డింగ్ వెలుస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీలకు ఎలాంటి ఫీజులు చెల్లించకుండానే, అనధికారికంగా రాజకీయ నాయకులు శుభాకాంక్షల పేరుతో పెద్దపెద్ద ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. అధికారిక ప్రకటనలకు సంబంధించిన గడువు ముగిసినా... రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు ఫ్లెక్సీలను తొలగించడానికి జంకుతున్నారని జిల్లాలోని పట్టణాల ప్రజలు అంటున్నారు.

కోర్టు ఆదేశాల అమలు ఏది?

నగరపాలక సంస్థ పరిధిలో రహదారుల పక్కన, ఎత్తయిన భవనాలపై, విద్యుత్ తీగల కింద, ఫుట్‌పాత్‌లపైన, విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను కూడా అమలు చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. గత ఏడాది పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగిస్తుండగా, ఓ జూనియర్ లైన్‌మెన్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. అయినా అధికారుల్లో చలనం లేదు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



హోర్డింగ్ బోర్డుల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ట్యాక్స్ చెల్లించని హోర్డింగ్ యజమానులకు నోటీసులు జారీ చేశాం. స్పందించకుంటే వారి హోర్డింగ్స్ తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. హోర్డింగ్‌లపై యజమానులు ఏజెన్సీ ఫోన్ నంబర్లు రాయించాలి. నిబంధనలు పాటించని ఫ్లెక్సీలను కూడా తొలగిస్తాం. – బి.సుమన్‌రావు, రామగుండం మున్సిపల్ కమిషనర్

కలెక్టరేట్ ఎదుట యూత్ కాంగ్రెస్ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పోలీసు ఉద్యోగాల కోసం పోటీపడ్డ అభ్యర్థులకు మల్టీపుల్ ప్రశ్నలకు ఏడు మార్కులు కలిపి మెయిన్స్‌కు అనుమతించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రన్నింగ్ అర్హతసాధించి లాంగ్‌జంప్‌లో అనర్హులైన వారిని కూడా మెయిన్స్‌కు అనుమతించాలన్నారు. ప్రభుత్వం అనుసరించిన తీరు ఎంతో మంది అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేసిందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పూదరి చంద్రశేఖర్, పట్టణ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు బుషణవేన సురేశ్‌గౌడ్ ఆరోపించారు. కొంత మంది అభ్యర్థులు మానసిక వేదన కు గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆయా కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అదించాలని డిమాండ్ చేశారు. నాయకులు బండారి సునీల్‌గౌడ్, కొమ్ము అభిలాష్, రాహుల్, మణికాంత్, విజయ్‌కుమార్ ఉన్నారు.

పత్తి క్వింటాలు ధర రూ.8,121



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం పత్తి క్వింటాలు ధర గరిష్ఠంగా రూ. 8121 పలికింది. కనిష్ఠంగా రూ.7256, సగటు ధర రూ.7955 గా నమోదైందని మార్కెట్‌కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్‌పృథ్వీరాజ్ తెలిపారు.

ఆర్టీసీకి సంక్రాంతి బొనాంజా

- తొమ్మిది రోజుల్లో రీజియన్‌లో రూ.13.82 కోట్ల ఆదాయం
- ఈనెల 18న ఒకేరోజు రూ.2.05 కోట్ల ఆదాయం

ఈనెల 10 నుంచి 18 వరకు వచ్చిన ఆదాయం

తేదీ	ఆదాయం(రూ.లక్షల్లో)
10	1,33,94,000
11	1,49,51,000
12	1,71,30,000
13	1,70,18,000
14	1,37,53,000
15	76,25,000
16	1,54,13,000
17	1,83,99,000
18	2,05,77,000
మొత్తం	13,82,60,000



కరీంనగర్: ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రాకపోకలతో భారీ ఆదాయం సమకూరింది. పండుగ సందర్భంగా ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపించగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది రోజుల్లోనే రూ.13 కోట్ల 82 లక్షల 60 వేల ఆదాయం సమకూరింది. రీజియన్ పరిధిలో ఈనెల 18న ఒక్క రోజు రూ.2 కోట్ల 5 లక్షల 77 వేల ఆదాయం సమకూర్చుకోవడం గమనార్హం. ఆ ఒక్క రోజే 4 లక్షల 2 వేల 586 కిలోమీటర్లు తిరుగగా 2 లక్షల 11 వేల మంది ఆర్టీసీలో ప్రయాణించగా ఈ ఆదాయం వచ్చింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో కరీంనగర్–1, కరీంనగర్–2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోల నుంచి 410 ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌కు నడిపారు. ఈ నెల 10 నుంచి 18 వరకు ప్రత్యేక బస్సులు నడిచాయి. ఆర్టీసీ సంస్థ ముందుగానే పండుగ సందర్భంగా ప్రత్యేకంగా చార్జీలు వసూలు చేయమని ప్రకటించడంతో ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపారు. పెట్రోల్, డీజిల్ ధరలు సైతం మండిపోతుండడంతో ప్రయాణికులు ఆర్టీసీనే ఆశ్రయించారు. కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో మకాం వేసి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. రీజియన్ పరిధిలో ఇంత భారీమొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఆర్టీసీని ఆదరించాలి



కరీంనగర్ రీజియన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఆదాయం తెచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లకు, డిపో మేనేజర్లకు శుభాకాంక్షలు. ముందస్తు రిజర్వేషన్లతోపాటు అదనపు చార్జీలు వసూలు చేయకుండా, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి ఆదాయాన్ని సమకూర్చుకోగలిగాం. – ఖుస్రో షా ఖాన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

రాష్ట్రంలో బీసీ గణన చేపట్టాలి



పాలకుర్తి(రామగుండం): రాష్ట్రవ్యాప్తంగా బీసీ జనగణన చేపట్టాలని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బసంత్‌నగర్‌లో మాట్లాడుతూ.. బీసీలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో ఎదగాలంటే కులగణన అవసరం అన్నారు. బీసీల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఒక్కరోజు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు దీక్షకు మద్దతు ప్రకటించాలని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు. జీఎస్.రావు, గాజుల రమేశ్, శ్రీనివాస్, జక్కం కవిత, పాషా, అఖిల్‌వర్మ, మల్లేశం ఉన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని దివ్యాంగులు వైద్య నిర్ధారణ పరీక్షల కోసం నేటి నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్‌బుకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని వివరించారు. శారీరక వైకల్యం ఉన్నవారు రెన్యువల్, కొత్తగా నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఈ నెల 21,25 తేదీలలో క్యాంపులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మానసిక అంగవైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్నవారికి జనవరి 24న, దృష్టిలోపం ఉన్నవారికి ఈనెల 27న, వినికిడిలోపం ఉన్నవారికి ఈ నెల 31న నిర్ధారణ పరీక్షలు ఉంటాయని వివరించారు.





ఊరూరా.. కంటివెలుగు జాతర

పెద్దపల్లిలో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో రెండో విడత కంటివెలుగు కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో కంటి వెలుగు క్యాంపును రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సంగీతతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని అమలు చేసి అంధత్వనివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కంటి వెలుగును విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. 18ఏళ్ల పైబడ్డ వారందరికీ కంటి పరీక్షలు చేసేందుకు జిల్లాలో 34 బృందాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ సంగీత వివరించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, వైద్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

4492 మందికి పరీక్షలు

జిల్లావ్యాప్తంగా తొలిరోజు 4492 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 1572 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 868 మందికి పాయింటెడ్, రీడింగ్ అద్దాలు అందించారు. 872 అద్దాలను ఆర్డరు పెట్టారు. శస్త్ర చికిత్సకు 70 మందిని సిఫారసు చేశారు.4492 మందికి మందులు పంపిణీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.


పెద్దపల్లిలోని కంటి వెలుగు క్యాంపునకు తరలివచ్చిన ప్రజలు

సుందరంగా తీర్చిదిద్దుతాం

సాక్షి ఫోన్‌ఇన్ – సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతగౌడ్

- మున్సిపల్ పరిధిలో మెరుగైన సౌకర్యాలు
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం
- తాగునీటి సమస్య పరిష్కరిస్తాం
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన



సుల్తానాబాద్(పెద్దపల్లి): 'మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్‌గా ఏర్పడిన సుల్తానాబాద్ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం. మున్సిపల్ పరిధిలో మెరుగైన సౌకర్యాల కల్పనకు మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పాలకవర్గం, జిల్లా అధికారుల చొరవతో ముందుకెళ్తున్నాం'అని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత పేర్కొన్నారు. గురువారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలువురితో మాట్లాడుతూ పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ప్రశ్న: చెరువు కట్ట నుంచి నీరుకుల్ల రోడ్డు వెడల్పు చేయండి – శ్రీనివాస్, టీచర్, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: చెరువు కట్ట నుంచి నీరుకుల్ల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు ఆహ్వానిస్తాం.

ప్రశ్న: ఇసుక లారీలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్య పరిష్కరించాలి

– శ్రీనివాస్, వ్యాపారి, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: ప్రస్తుతం ఇసుక లారీల వల్ల దుమ్ము లేవడంతో ప్రభుత్వ ఉన్నతాధికారులకు చెప్పి నీటితో క్యూరింగ్ చేయిస్తున్నాం. ప్రత్యామ్నాయంగా ఎస్సారెస్పీ కాలువ ద్వారా బైపాస్ మాదిరిగా రోడ్డువేయాలని అధికారులకు సూచించాం.

ప్రశ్న: సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

– వేణు, వ్యాపారి, శ్రీరాంపూర్‌రోడ్, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: రాజీవ్ రహదారిపైన శ్రీరాంపూర్ రోడ్ వద్ద సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే అన్ని రకాల చర్యలు చేపట్టాం. ప్రజలు, వ్యాపారులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశం రాగానే సిగ్నల్స్ ప్రారంభిస్తాం.

ప్రశ్న: పూసాల రోడ్డు వెడల్పు ఎప్పుడు చేస్తారు?

– కుమార్‌గౌడ్, పూసాల

మున్సిపల్ చైర్‌పర్సన్: పూసాల రోడ్డు వెడల్పు చేసేందుకు పాలకవర్గం తీర్మానించి ఆమోదం తెలిపింది. రూ.2 కోట్ల వ్యయంతో అంచనా వేసి టెండర్‌లు ఆహ్వానించాం. టెండర్ ప్రక్రియలో ఉంది.

ప్రశ్న: శంభుని చెరువు వద్ద శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించండి. – శేఖర్, పూసాల

మున్సిపల్ చైర్‌పర్సన్: ఇప్పటికే హిందూ శ్మశాన వాటిక ఏర్పాటు చేశాం. అందులో సెంట్రల్ లైటింగ్‌తో పాటు పవర్ సప్లై చేస్తున్నాం. నీటి సౌకర్యం అందుబాటులో ఉంది. అవసరమైతే ఇంకా సౌకర్యాలు కల్పిస్తాం.

ప్రశ్న: పూసాల రోడ్డు పరిధిలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. పరిష్కరించాలి.

– రమేష్‌గౌడ్, పూసాల రోడ్డు, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: పూసాల రోడ్డులో ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు అంచనా వేసి ఇచ్చారు. పాలకవర్గం ఆమోదం తెలిపింది. రెండు వైపులా ప్రజల సౌకర్యార్థం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కనెక్షన్లు ఇచ్చేలా చూస్తాం.

ప్రశ్న: తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎప్పుడు పరిష్కారమువుతుంది?

– శ్రీనివాస్, గౌడ వీధి, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: రూ.64 లక్షలతో టెండర్ పూర్తి చేశాం. పనులు జరగాల్సి ఉంది.

ప్రశ్న: ఇంటి పన్నులు అధికంగా వసూలు చేస్తున్నారు. వాటిని తగ్గించే అవకాశం ఉందా?

– కుమార్‌యాదవ్, గొల్లపల్లి

మున్సిపల్ చైర్‌పర్సన్: కౌన్సిల్ సమావేశం పెట్టి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదేశం మేరకు పాలకవర్గ సహకారంతో తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విలీన గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదు.. ఎందుకు? – రామ్మూర్తి, సుగ్లాంపల్లి

మున్సిపల్ చైర్‌పర్సన్: విలీన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. తాగునీటికి ఇబ్బందులు కలగకుండా రోజువారీ సమీక్ష చేస్తున్నాం.

ప్రశ్న: మురుగునీరు శుద్ధి చేసేందుకు స్థలం కేటాయించారా? – కోమల్, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: బస్టాండ్ ఎదురుగా ఉన్న స్థలాన్ని కేటాయించి అధికారులకు అప్పగించాం.

ప్రశ్న: ముఖ్య కూడళ్ల సుందరీకరణ ఎప్పుడు చేస్తారు? – సముద్రాల రమేష్, సుల్తానాబాద్

మున్సిపల్ చైర్‌పర్సన్: పట్టణ, కూడళ్ల సుందరీకరణకు ప్రభుత్వ పాలనాపరమైన అనుమతులు తీసుకున్నాం. రూ.20 లక్షలతో అనుమతి వచ్చింది. త్వరలో పనులు చేపడుతాం.

క్లుప్తంగా

గూడ్స్ వాహనాల్లో ప్రజారవాణా నిషేధం



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ

జ్యోతినగర్(రామగుండం): గూడ్స్ పర్మిట్ వాహనాల్లో ప్రజలను తీసుకెళ్లడం చట్టరీత్యా నిషేధమని గోదావరిఖని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. గూడ్స్ వాహనాల్లో ప్రజా రవాణా చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో జరుగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.

వాటర్‌ట్యాంకర్‌ను ఢీకొన్న మినీవ్యాన్

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం డెయిరీఫాం ఎదుట జాతీయ రహదారిపై గురువారం వాటర్‌ట్యాంకర్‌ను మినీవ్యాన్ ఢీకొంది. హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజాకు చెందిన వాటర్‌ట్యాంకర్‌తో ఫోర్‌లైన్ రహదారి డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలకు నీళ్లు పడుతుండగా పెద్దపల్లి వైపు వేగంగా వెళ్తున్న మినీవ్యాను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. రెండువాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బసంత్‌నగర్ పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా మహేశ్

జూలపల్లి(పెద్దపల్లి): మండలకేంద్రానికి చెందిన పాటకుల మహేశ్‌ను మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఉత్తర్వులు జారీ చేశారు. మహేశ్ మాట్లాడుతూ డా.బీఆర్.అంబేద్కర్, స్వర్గీయ పీవీ.రావు ఆశయాల సాధనకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

ముత్తారం: మండలంలోని పారుపల్లి, ముత్తారం గ్రామాల్లోని మానేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకుని జరిమానా విధించారు. తహసీల్దార్ వరందన్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

ముత్తారం: మండలకేంద్రంలోని మద్యం షాపులను గురువారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే మద్యం విక్రయించాలని సూచించారు. ఎవరైన ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి రాథోడ్, మంథని సీఐ గురువయ్య ఉన్నారు.

'గుర్తింపు'పై ఉత్కంఠ!



యూనియన్ల జెండాలు



డిప్యూటీ చీఫ్‌లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

- హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా..
- ముందుకు సాగని ఎన్నికల ప్రక్రియ
- స్పష్టత ఇవ్వని యాజమాన్యం
- ఎన్నికలపై త్వరలో సీఎల్‌సీకి లేఖ
- పదిరోజుల్లోగా స్పందించకుంటే కార్యాలయం ముట్టడి

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ వీడడం లేదు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో గుర్తింపు యూనియన్ ఎన్నికలు అన్ని ప్రధాన పార్టీలు, జాతీయ కార్మిక సంఘాలకు కీలకంగా మారాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ప్రత్యక్ష ప్రభావం చూపే ఈ ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు, జాతీయ కార్మిక సంఘాలు సీరియస్‌గా తీసుకున్నాయి. సింగరేణిలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధమని అన్ని యూనియన్లు ఇప్పటికే ప్రకటించాయి. అయితే సింగరేణి సంస్థ మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వడంలేదు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లో 42వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం గుర్తింపు యూనియన్‌గా బీఆర్‌ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ కొనసాగుతోంది. రెండు దఫాలుగా గుర్తింపు యూనియన్‌గా టీబీజీకేఎస్ గెలుపొందింది. గుర్తింపు గడువు పూర్తయినా సింగరేణి యాజమాన్యం ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వానికి అనుబంధంగా టీబీజీకేఎస్‌కు సింగరేణి వత్తాసు పలుకుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈక్రమంలో జాతీయ కార్మిక సంఘం ఏఐటీయూసీ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టుకు వెళ్లింది. దీనిపై స్పందించిన హైకోర్టు మూడు నెలల్లోగా గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యం, ఆర్‌ఎల్‌సీకి ఆదేశాలు జారీ చేసింది.. ఫిబ్రవరి 28న హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తి కానుంది. అయినప్పటికి ఇప్పటివరకు ఎలాంటి ముందడుగు పడలేదు. దీనిపై ఏఐటీయూసీ బుధవారం డిప్యూటీ సీఎల్‌సీకి వినతి పత్రం అందజేసింది. మరో పదిరోజుల్లోగా సింగరేణిలో ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్‌ఎస్‌సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించింది.

యూనియన్లకు నోటీసులు..

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలకు సంబంధించి సంస్థలో ఉన్న 17యూనియన్లకు మూడు సార్లు లేఖలు పంపినట్లు ఆర్‌ఎల్‌సీ కార్యాలయం పేర్కొంటోంది. కోర్టు ఉత్తర్వులను అనుసరించే ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేస్తున్నారు. సంస్థలో 35యూనియన్లు ఉండగా వీటిలో 17యూనియన్లు మాత్రమే స్పందించాయని మిగితా యూనియన్లు స్పందించడంలేదని తెలిపింది. ఈ క్రమంలో స్పందించిన యూనియన్ల వివరాలతో సీఎల్‌సీకి లేఖ రాయనున్నట్లు పేర్కొంది. సీఎల్‌సీ నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఆర్‌ఎల్‌సీ కార్యాలయం పేర్కొంటోంది. గుర్తింపు ఎన్నికలు కోర్టు ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా నిర్వహించాలని ఆర్‌ఎల్‌సీని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ సీఎల్‌సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆర్‌ఎల్‌సీ కార్యాలయం ముట్టడిస్తాం

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలను కోర్టు ఉత్తర్వుల ప్రకారం సకాలంలో నిర్వహించకపోతే ఆర్‌ఎల్‌సీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోతే తిరిగి కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కింద మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తాం. గడువు ముగిసినా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కావాలనే ఎన్నికలను జాప్యం చేస్తున్నాయి.

– సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

బొగ్గుబాయి వార్తలు

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని: గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ ఆదేశించారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో వేడుకలు వైభవంగా నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మార్చ్‌ఫాస్ట్, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, స్కూల్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, సీఎంవోఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం రామక్రిష్ణ, గ్రూప్ఏజెంట్ చిలక శ్రీనివాస్ ఉన్నారు.

స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఉల్లి మొగిలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేట్ కన్వెన్స్ డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని ఎస్‌సీఈయూ కార్యదర్శి ఉల్లి మొగిలి డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సీఐటీయూ ప్రైవేట్ కాన్వెన్స్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సింగరేణిలో ప్రయివేటు వాహనాల డ్రైవర్లకు జీవో ప్రకారం సింగరేణి యాజమాన్యం చెల్లిస్తున్న స్కిల్డ్ వేతనాలు వాహన యాజమానులు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి నరేశ్, నాయకులు భూమయ్య, లక్ష్మీ నారాయణ, రాములు, నాగరాజు, రామన్న, సదానందం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీఎం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని: చందనాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీని ఖాళీచేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం కలెక్టర్ సంగీతను ఆర్జీ–1 జీఎం నారాయణ గురువారం కలిశారు. జీడీకే–11గనిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం లేకుండా సహకరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ లక్ష్మినారాయణ, మంథని ఆర్డీవో వీరాబ్రహ్మచారి, ఎస్టేట్స్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలి



నియామక పత్రాలు అందిస్తున్న జీఎం

గోదావరిఖని: క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగి ఉద్యోగంలో రాణించి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ ఆకాంక్షించారు. గురువారం జీఎం కార్యాలయం ఆవరణలో 8మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కొత్తగా ఉద్యోగంలో చేరే యువ ఉద్యోగుల్లో గైర్హాజరుశాతం పెరుగుతోందన్నారు. చిన్న సంస్థలో కూడా ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిన ఇప్పటి పరిస్థితుల్లో సింగరేణి సంస్థలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించి అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీనియర్‌పీఓ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం



వినతిపత్రం అందజేస్తున్న ఐలి శ్రీనివాస్

గోదావరిఖని: కార్మికుల సమస్యల పరిష్కారంలో టీబీజీకేఎస్ యూనియన్ రాజీలేకుండా ముందుకు సాగుతోందని ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్‌లో హెచ్ఓడీ రామక్రిష్ణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం సింగరేణిలో గెలిచినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ వస్తోందన్నారు. హెచ్‌ఎంఎం మజ్దూర్, గ్రీజర్ ఆపరేటర్ పదోన్నతులు ఇప్పించామన్నారు. 170 మంది అండర్‌గ్రౌండ్ కార్మికులకు పారదర్శకంగా సర్ఫేస్ జనరల్‌మజ్దూర్‌గా అవకాశం కల్పించామన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన అనేక హక్కులను తిరిగి తేవడంతో పాటు అనేక కొత్త హక్కులు సాధించామన్నారు. యాక్టింగ్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించడం యాజమాన్యం బాధ్యత అన్నారు. ఉన్న ఉద్యోగులపైనే పనిభారం మోపడం సరైన పద్ధతి కాదన్నారు. బ్రాంచి కార్యదర్శి కర్క శ్రీనివాస్, అక్రమ్, జగన్‌బాబు, శ్రీను, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. జెడ్పీ సీఈవో

- ఎంఏయూడీ డిప్యూటీ డైరెక్టర్ పేరుతో ఫోన్‌కాల్స్
- జిల్లా పరిషత్‌కు నిధులిస్తామని కేటుగాళ్ల ఎర
- కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రియాంక



ప్రియాంక

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'నేను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) నుంచి మాట్లాడుతున్నాను. ఎంఏయూడీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. కరీంనగర్ జిల్లాకు నిధుల అవసరం ఉందా? ఉంటే మాకు చెప్పండి. కావాల్సినన్ని నిధులు మంజూరు చేస్తాం. మీరు అడిగినన్ని నిధులు మంజూరు చేస్తాం కాకపోతే, మీరు నాకు కొంత కమీషన్ ముట్టజెప్పాల్సి ఉంటుంది.'

ఇదీ.. కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకకు వచ్చిన ఫోన్ కాల్. గురువారం ఉదయం 73867 19629 నెంబరు నుంచి కాల్ రాగా.. తొలుత ఎంఏయూడీ నుంచి వచ్చినట్లుగానే భావించారు. కానీ.. డిప్యూటీ డైరెక్టర్‌గా తనను తాను పరిచయం చేసుకున్న తీరు, నిధుల ప్రస్తావనపై అనుమానం కలిగింది. నిధులు కావాలంటే.. ఇలా ఎవరూ ఫోన్ కాల్స్ చేయరని గ్రహించిన ఆమె అతను చెప్పింది విన్నారు. కానీ.. ఎక్కడా అతని మాటలకు తొందరపడలేదు. అతను మోసగాడని గ్రహించి ఏమేం కావాలో అడిగారు. దీంతో అతను ముందుగా తనకు కమీషన్ కింద డబ్బులు వేయాలని సూచించడంతో సరే అని ఫోన్ పెట్టేశారు.

వెంటనే విషయాన్ని పోలీసులకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెంబరు నుంచి కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకకే కాకుండా.. రాష్ట్రంలోని పలువురు మున్సిపల్, జిల్లా చైర్‌పర్సన్లకు కూడా కాల్స్ వెళ్లినట్లు తెలిసింది. వెంటనే ఈ విషయాన్ని మున్సిపల్, జిల్లా పరిషత్ అధికారులకు వాట్సాప్ సందేశం ద్వారా ఆయా విభాగాల అధికారులు హెచ్చరించారు. ఈ విషయంలో కొసమెరుపు ఏంటంటే.. జెడ్పీ సీఈవో నుంచి ఫేక్ కాల్ విషయంపై ఫిర్యాదు రాగానే.. పోలీసులు సదరు నెంబరు వివరాలపై ఆరా తీస్తున్నారు. ట్రూ కాలర్‌లో ఆ నెంబరు శ్రీకాంత్, డీడీ, ఎంఏయూడీ అని ఫీడ్ చేసి ఉండటం గమనార్హం. ఇటీవల మే నెలలో జగిత్యాల జిల్లా మల్యాల తహసీల్దార్, ఎస్సైలకు ఏసీబీ డీఎస్పీ పేరిట సైబర్ కేటుగాడు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కరీంనగర్ కమిషనరేట్‌లో సైబర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2021లో కేవలం 34 కేసులు నమోదు కాగా, 2022లో 86 కేసులు రికార్డయి సైబర్ నేరాలు రెట్టింపయ్యాయి. ఇలాంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సత్యనారాయణ ప్రజలకు సూచించారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మద్యానికి బానిసై, ఒంటరితనం భరించలేక, ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాలవశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోరుపాట సమ్మయ్య(39) తండ్రి రాజలింగు చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి భాగ్యమ్మ పోషించింది. ఎంఎల్‌టీ చదివిన సమ్మయ్య బెల్లంపల్లికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తూ భార్యను పోషించాడు. ఇద్దరిమధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. తరువాత సమ్మయ్య మహారాష్ట్రకు చెందిన స్వాతిని వివాహం చేసుకున్నాడు. ఆమెతోనూ గొడవలు కావడంతో పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో సొంతూరికి వచ్చిన సమ్మయ్య మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడం మానేయాలని తల్లి ఎంత చెప్పినా వినలేదు. దీంతో తల్లి భాగ్యమ్మ బంధువుల ఇంటికెళ్లి తలదాచుకుంటోంది. ఒంటరిగా ఉంటున్న సమ్మయ్య గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొద్దుపోయినా ఇంట్లోంచి బయటకురాకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు వారు వెళ్లిచూడగా ఉరేసుకునిగా విగతజీవిగా కనిపించాడు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ వివరించారు.

సేవలను అడ్డుకుని.. ప్రజలకు దూరం చేసే కుట్ర

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పుట్టమధు

మంథని: తనతల్లి పేరిట స్థాపించిన ట్రస్టు ద్వారా పేదలకు సేవ చేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు కుట్రలుచేసి అడ్డుకుని, ప్రజలకు తనను దూరం చేసేందుకు ప్రయత్నాలు చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్టమధు అన్నారు. గురువారం మంథని మండలం మల్లెపల్లి పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించారు. మంథని ప్రాంతాన్ని ఏళ్ల కాలం పాలించిన కాంగ్రెస్ నాయకులు ఏనాడూ పేదల ఆకలి తీర్చాలనే ఆలోచన చేయలేదని అన్నారు. తాము ముందుకొస్తే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ప్రిన్సిపాల్ తాహెర్ హుస్సేన్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ ఉన్నారు. అనంతరం నగరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మహబూబ్‌పల్లిలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పాం సాగు అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

ఇద్దరిని పోలీసులకు అప్పగింత



అనుమానితులను పట్టుకున్న స్థానికులు

గోదావరిఖని: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గురువారం ఉదయం పూట తాళాల గుత్తులు, కత్తితో స్థానిక జవహర్‌నగర్ ఏరియాలో తిరుగుతున్న ఇద్దరిని స్థానికులు గుర్తించారు. పట్టుకుని తాళ్లతో కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. మద్యం సేవించి ఉన్న వీరిద్దరు మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన వారిగా తెలుస్తోంది. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. గతంలో పలు ఇళ్లలో దొంగతనాలు జరిగిన నేపథ్యంలో వీరే ఈ పని చేసిఉంటారనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సీఐ శశిధర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ మహాత్మానగర్ చెందిన మహమ్మద్ అన్వర్ (51) తన ఎక్సెల్ బైక్‌పై తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా అల్గునూర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో అన్వర్ బైక్ నుంచి కింద పడ్డాడు. ఢీకొట్టిన వాహనం అన్వర్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.



హుషారుగా 'అలోహ'



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మనోహర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలోహ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలుండాలనే ఉద్దేశంతో అలోహ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, హెచ్‌వోడీలు ప్రవీణ్‌కుమార్, బలరాం, శ్రీధర్, సంపత్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.